

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 22.0

లోపలి పేజీల్లో..



చేయి చేయి కలిపారు

- విద్యాసంస్థల అభివృద్ధికి ఏకమైన పూర్వ విద్యార్థులు
- కొల్లాపూర్ రాణి ఇందిరాదేవి పేరున విద్యాసంస్థలు
- మౌలిక వసతుల కల్పనకు సిద్ధమైన ప్రణాళిక
- నవంబరులో ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు 6



మట్టి దందా

- ఏపీ టు తెలంగాణ 6

- తెలంగాణ మైనింగ్‌కు భారీ నష్టం
- మూణ్నెళ్లలో వేలాది టిప్పర్లతో రవాణా
- చోద్యం చూస్తున్న స్థానిక అధికారులు



7

జింకల దండు దాడి

- నాశనం అవుతున్న పచ్చని పంటలు
- మేత కోసం వనాన్ని వీడుతున్న వన్య ప్రాణులు

అమరులకు.. సెల్యూట్

ఒకప్పుడు పొద్దున లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు ఎక్కడో ఒకచోట తుపాకుల మోతలు.. మందుపాతరల శబ్దాలు వినిపించేవి.. ఇలా నెలలు, సంవత్సరాలు కాదు.. ఏకంగా దశాబ్దంన్నర కాలం పాటు పోలీసులకు, మావోయిస్టులకు మధ్య యుద్ధమే జరిగింది.. కూంబింగ్ పేరిట పోలీసులు నెలల తరబడి కుటుంబాలకు దూరంగా అడవుల్లో గడిపారు.. ఇంటి నుంచి వెళ్ళిన వ్యక్తి తిరిగి వస్తాడా? అన్న భయంతో వారి కుటుంబాలు అనుక్షణం అల్లాడిపోయేవి.. నల్లమల అడ్డగా నక్సల్స్ చేసిన కార్యకలాపాలు, వాటిని అడ్డుకునేందుకు పోలీసులు చేసిన పోరాటాలు అన్నీ ఇన్నీ కావు.. 1990 నుంచి 2006 వరకు ఉమ్మడి జిల్లాలో క్షణ క్షణం భయం భయం అన్నట్లుగా సాగింది.. ఆ సమయంలో 39 మంది పోలీస్ అధికారులు, పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలను త్యాగం చేశారు. వారి త్యాగాలకు గుర్తుగా నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పోలీస్‌శాఖ నిర్వహిస్తోంది. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులకు సెల్యూట్..

- మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి

- 1990-2006 వరకు పోలీసులకు, మావోయిస్టులకు మధ్య భీకరపోరు
- శాంతి భద్రతలను కాపాడటంలో ప్రాణాలు ఫణంగా పెట్టిన పోలీసులు 7
- ఉమ్మడి జిల్లాలో 39 మంది మృతి
- సంచలనం రేకెత్తించిన సోమశిల ఘటన
- నేడు పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం

ఉలిక్కిపడ్డ నారాయణపేట

- 2005 ఆగస్టు 15న మావోయిస్టుల మారణకాండ 7
- అప్పటి ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డితో పాటు పది మంది మృతి
- విధి నిర్వహణలో అసువులు బాసిన ఎమ్మెల్యే గన్‌మెన్ రాజారెడ్డి



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ అమర వీరుల స్తూపం

రెండేళ్లయినా

పూర్తికాలే

- నత్తకు నడక నేర్పుతున్న జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణం
- పాత భవనంలో ఇబ్బంది పడుతున్న పాఠకులు
- పనులను పూర్తి చేయాలంటున్న స్థానికులు, నిరుద్యోగులు



నాగర్‌కర్నూల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న జిల్లా గ్రంథాలయాల సంస్థ నూతన భవనం

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 20: అధునాతన వసతులతో నిర్మిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన భవనం నిర్మాణ పనులు రెండేళ్లైనా పూర్తి కావడం లేదు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని బస్‌డిపో రోడ్డులో పాత వ్యవసాయ గోదాం స్థలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన భవనం నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులతో 2022 జూన్ 18న మాజీమంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. కానీ నూతన భవనం నిర్మాణ పనులు నత్తకు నడకనేర్పుతున్నట్లు సాగుతున్నాయని పాఠకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఫ్లోరింగ్, డోర్లు, కిటికీలు బిగించే పనులతో పాటు కరెంటు వైరింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నిర్మాణ పనులకు ప్రారంభించి రెండేళ్లు పూర్తియినా నేటికి అందుబాటులోకి రాకపోవడమేంటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంగా మారినా గ్రంథాలయానికి సొంత భవనమే లేకపోవడం విడ్డూరం. జిల్లా ఏర్పడిన తర్వాత కూడా చాలా కాలంగా అద్దె భవనంలో కొనసాగింది. ప్రస్తుతం పాత మునిసిపాలిటీ భవనంలో నిర్వహిస్తున్నారు. అందులోనూ గదులు ఇరుకుగా ఉండడంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా మెప్మా కార్యాలయాన్ని కూడా దానిలోనే నిర్వహిస్తుండడంతో వారి రాకపోకలు అక్కడి నుంచి కొనసాగిస్తున్నారు.

దీంతో పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రంథాలయం నూతన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని పాఠకులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పాత భవనంలో ఇబ్బందిగా ఉంది



పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఇంటి వద్ద చదుకోవడం కష్టంగా ఉంటుందని లైబ్రరీకి వెళ్తున్నా. ఇక్కడ కూడా ప్రశాంత వాతావరణం లేదు. మెప్మా ఆఫీసు ఇందులోనే ఉండడంతో వచ్చి పోయే వారి వలన ఏకాగ్రత కోల్పోతున్నా. కంప్యూటర్ లాబ్ ఉన్నా అందులో కూర్చునేందుకు స్థలం లేదు.

శ్రావణ్, పోటీ పరీక్షల అభ్యర్థి, నాగర్‌కర్నూల్

భవనం నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



దినపత్రికలు, పుస్తకాలు చదివేందుకు రోజూ గ్రంథాలయానికి వెళ్తాను. ఇరుకైన గదులతో పాటు సరైన వసతులు లేవు. వరండాలోనే కూర్చొని చదువుకుంటున్నా. నూతన భవనం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి.

- రమేష్, పాఠకుడు, నాగర్‌కర్నూల్

పేదల అభ్యున్నతే

కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- సమీక్ష సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి

నాగర్‌కర్నూల్/గద్వాల న్యూటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీ మల్లు రవి అన్నారు. ఈ నెల 22న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన అవకాశాల పై అవగాహన సదస్సు, నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్, ఎంఎస్ఎంఈ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవ సహాయం, గద్వాల అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల అధికారులు, బ్యాంక్ అధికారులతో ఈనెల 22వ తేదీన నాగర్‌కర్నూల్ పట్టణంలో చేపట్టనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అవగాహన సదస్సుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లురవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అందిస్తున్న అనేక రకాల పథకాలను ప్రజలకు నిరుద్యోగ యువతీ యువకులకు చేరువ చేసే దిశగా జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అధికారులకు తెలియజేశారు. ఈ నెల 22న నాగర్‌కర్నూల్ పట్టణంలోని తేజ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్, ఎంఎస్ఎం, వివిధ బ్యాంకులకు సంబంధించిన ఉన్నతాధికారులు పాల్గొంటారని, ప్రభుత్వాలు అందించే పలు పథకాలకు సంబంధించిన రుణాల మంజూరు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు లాంటి విషయాలను వివరిస్తారని తెలియజేశారు. ప్రతీ వ్యక్తికి రుణాలు అందించే విధంగా బ్యాంకర్లు సిద్ధంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గం ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గమని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజల ఆర్థిక అభ్యున్నతికీ బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. సీఎస్ఆర్ నిధులతో విద్యా వైద్యానికి ఖర్చు చేసి మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో నాగర్‌కర్నూ ల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పించనున్నట్లు ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో జరగనున్న అవగాహన సదస్సుకు ప్రజలు, డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జోనల్ అధికారి శ్రీనివాస్, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ అవార్డు ఎన్‌జీవో అధ్యక్షుడు వెంకట్, నాగర్‌కర్నూల్ డీఆర్‌డీఏ చిన్న ఓబులేష్, డీఈవో గోవిందరాజులు, బీసీ వెల్ఫేర్ అధికారి నజీమ్‌ఆలీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాంలాల్, డీఆర్‌డీవో ఉమాదేవి, ఎల్‌డీఎం శ్రీనివాసులు, కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ ప్రైజెస్ కో ఆర్డినేటర్ ఆఫ్ ఎస్సీ ఎస్టీ ఎంటర్ ప్రైజెస్ ప్రెసిడెంట్ నల్లబాబు, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల ఆర్‌సీవోలు పాల్గొన్నారు.



ఏపుగా పెరిగిన పొగాకు పంట

పొగాకు రైతుకు

కలిసొచ్చేనా?

- గతేడాదితో పోలిస్తే మూడింతలు పెరిగిన సాగు

నడిగడ్డ రైతు పొగాకు సాగువైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో ఉన్న ధరకంటే అధిక ధర చెల్లిస్తామని కంపెనీల యజమానులు హామీ ఇవ్వడంతో రైతులు పప్పు శనగ పంటను వదిలేసి పొగాకు సాగు విస్తీర్ణం పెంచారు. ఒక్క అలంపూర్ క్లస్టర్ పరిధిలో సుమారు 17వేల ఎకరాలు సాగు చేశారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది మూడింతలు పెరిగింది. - అలంపూర్ చౌరస్తా (ఆంధ్రజ్యోతి):



కళకళలాడుతున్న పప్పుశనగ పంట (ఫైల్)

- వివరాలు 7లో..



ఆగమవుతున్న అన్నదాతలు

- కొల్లాపూర్ మండలంలో 120 ఎకరాల వరి, 69ఎకరాల మినుము పంట నష్టం

కొల్లాపూర్/కోడేరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలకు అన్నదాతలు ఆగమవుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో వరి, మినుము సాగుచేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారం రోజుల నుంచి వరుసగా కురుస్తున్న వర్షాలతో కొల్లాపూర్ మండలంలో 120ఎకరాల వరి, 69 ఎకరాల్లో మినుము పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు తెలిపారు. కొల్లాపూర్ మండలంలోని రామాపురం గ్రామంలో ఆకునమోని వెంకటయ్య రెండున్నర ఎకరాల్లో వేసిన వరి పంట శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం కురిసిన వర్షానికి నేలకొరిగింది. పంట చేతికి వస్తుందనుకున్న దశలో వర్షాలు కురవడం వల్లన తమకు తీరని నష్టం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మొలచింతలపల్లిలో నేలకొరిగిన పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను పంపుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి చిన్నహస్సేన్‌యాదవ్ తెలిపారు. అదేవిధంగా కోడేరు మండల కేంద్రంతో పాటు, పస్పుల, బావాయిపల్లి, తీగలపల్లి, జనుంపల్లి, నాగులపల్లి, ముత్తిరెడ్డిపల్లి, ఎత్తం, రాజాపూర్, నర్సాయిపల్లి తదితర గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. నేలకొరిగిన వరి పంటపైకి ఎత్తి కొన్ని కొన్ని కలిపి కట్టే ప్రయత్నం రైతులు చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన వరి, మినుములు, వేరుశనగ పంటలను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



కోడేరు మండలంలో వర్షాలకు నేలకొరిగిన వరి పైరు



ఆధ్యాత్మికం..

పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగింపు


వట్టెం వెంకన్న స్వామి పవిత్రోత్సవాల ముగింపు పూజల్లో పాల్గొన్న భక్తులు

బిజినేపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం వెంకన్న స్వామి పవిత్రోత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో ఘనంగా ముగించినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సందడి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పవిత్రోత్సవాల ముగింపులో భాగంగా స్వామి వారికి భక్తులు అభిషేకాలు, పవిత్ర మాలా ప్రదానం, స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గోమాతకు పలువురు భక్త దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, బార్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు అనంత నరసింహారెడ్డి, కొర్ర చంద్రారెడ్డి, వాస ఈశ్వరయ్య, బుచ్చయ్య, విశ్వ ప్రసాద్, పోల రాము, బండారు రాజశేఖర్, శ్రీరామ్ రెడ్డి, సత్యనారాయణ, జక్కాల్ రెడ్డి, బాలకిష్టారెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.

మైసమ్మ దేవతను దర్శనం చేసుకున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తులకు కొంగుబంగారంగా వెలసిన మైసమ్మ దేవతను ఈ ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, వనపర్తి జిల్లాల నలుమూలల నుంచి ఈ ఆదివారం దాదాపు 15వేల మందికి పైగా భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఈ ఆదివారం హుండీ ద్వారా 93వేల 195 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. టికెట్ల ద్వారా 38,890 రూపాయలు మొత్తం 1,32,85 రూపాయలు ఆదాయం మైసమ్మ దేవతకు వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో రామేశ్వర్ శర్మ తెలిపారు.

ఉమామహేశ్వర ఆలయానికి కోడెదూడ వితరణ

అచ్చంపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమామహేశ్వర క్షేత్రం ఆలయానికి మండల పరిధిలోని రంగాపూర్ గ్రామానికి చెందిన గంధ బాలు కోడె దూడ వితరణ చేశారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు, కమిటీ చైర్మన్ మాధవరెడ్డి ఆధ్వరంలో ఆలయానికి అందజేశారు. ముందుగా వారు ఆలయంలోని పాపనాశిని గుండంలో పుణ్య స్నానాలు ఆచరించి ఈశ్వరునికి క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన గణపతి అయ్యప్ప స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో దంపతులకు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆలయంలో త్వరలో గోశాల ఏర్పాటుకు కమిటీలో చర్చించామన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

» తల్లిని కాపాడిన స్థానికులు


పోషన్న(ఫైల్)

హన్వాడ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఇంటిని శుభ్రం చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై యువకుడు మృతి చెందగా, తల్లిని స్థానికులు కాపాడిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని వేపూర్‌లో చోటు చేసుకుంది.

గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వేపూర్ గ్రామనికి చెందిన సాయన్న, కనకమ్మ కుమారుడు పోషన్న(23) ఆదివారం సాయంత్రం ఇల్లు శుభ్రం చేస్తుండగా విద్యుత్ వైర్లు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, తల్లి బయటి నుంచి వచ్చి కొడుకును తాకడంతో కనకమ్మ షాక్‌కు గురై కేకలు వేసింది. ఇది గమనించి చుట్టుపక్కల వారు వైర్‌ను కట్టెతో తొలగించి ఆమెను కాపాడారు. పోషన్న అప్పటికే మృతి చెందాడు. మృతుడు ఇంటర్ వరకు చదివి తల్లిదండ్రులతో కలిసి పని చేస్తూ జీవించేవాడని గ్రామస్థులు తెలిపారు. ఉన్న ఒక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

చేయి చేయి కలిపారు

● విద్యాసంస్థల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషి

- » కొల్లాపూర్ రాణి ఇందిరాదేవి పేరున విద్యాసంస్థలు
- » మౌలిక వసతుల కల్పనకు సిద్ధమైన ప్రణాళిక
- » 97 ఏళ్ల క్రితం పాఠశాల, 50 ఏళ్ల క్రితం కళాశాల ఏర్పాటు
- » నవంబరులో ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు

చిన్నతనంలో అక్షరాలు దిద్ది, విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల.. జీవిత పాఠాలు నేర్పించి, భవిష్యత్తుకు బాటలు వేసిన కళాశాల అభివృద్ధికి ఏదైనా చేయాలన్న తపన పూర్వ విద్యార్థులను ముందుకు నడిపించింది. సురభి సంస్థానాధీశుల కాలంలో రాణి ఇందిరా దేవి పేరున 94 ఏళ్ల కిత్రం ప్రారంభించిన పాఠశాల, 50 ఏళ్ల కిత్రం ఏర్పాటు చేసిన కళాశాలల పునర్నిర్మాణానికి సిద్ధమయ్యారు. స్ఫూర్తిదాయకమైన వారి సంకల్పంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం – కొల్లాపూర్, ఆంధ్రజ్యోతి


ఆర్‌ఐడీ పాఠశాలలో కొనసాగుతున్న వైరింగ్ పనులు



కొల్లాపూర్‌లో ఆర్‌ఐడీ పాఠశాల తరగతి గదుల ముందు వరండా

తాము చదువుకున్న విద్యాసంస్థల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయిచేయి కలిపారు. అందరూ ఒక్కటై ముందుకు సాగుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ పట్టణంలో సురభి సంస్థానాధీశుల కాలంలో 1930 సంవత్సరంలో రాణి ఇందిరాదేవి పేరున ఉన్నత పాఠశాలను ప్రారంభించారు. స్వాతంత్ర్యానంతరం 1970లో ఆమె పేరునే కళాశాలను ఏర్పాటు చేశారు. ఆ విద్యాసంస్థల్లో చదువుకున్న పలువురు ప్రస్తుతం వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిల్లో ఉన్నారు. రాష్ట్ర స్థాయి ప్రముఖులుగా, ప్రజాప్రతినిధులుగా, రాజకీయ నాయకులుగా, విద్యావేత్తలుగా, సామాజికవేత్తలుగా, ఉన్నతోద్యోగులుగా దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. వారందరూ తమ పూర్వ జ్ఞాపకాలను నెమరు వేసుకునేందుకు, ఆ నాటి రోజులను గుర్తు చేసుకునేందుకు ఒక వేదికను ఏర్పాటు చేసుకున్నారు. ఆర్‌ఐడీ ఉన్నత పాఠశాల పేరున అలుమినీ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. పూర్వ విద్యార్థులతో పాటు, అప్పటి ఉపాధ్యాయులు, అధ్యాపకులను అందులో చేర్చారు.

విద్యాసంస్థల అభివృద్ధికి చర్యలు

తాము చదువుకున్న పాఠశాల గుర్తులు చెదిరిపోవొద్దని పూర్వ విద్యార్థులు సంకల్పించుకున్నారు. శిథిలావస్థకు చేరిన ఆర్‌ఐడీ పాఠశాల భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయిస్తున్నారు. అందుకోసం ఇదే పాఠశాలలో చదువుకొని రియల్ ఎస్టేట్ రంగంలో ప్రముఖుడిగా గుర్తింపు పొందిన వ్యక్తి దాదాపు 50 లక్షల రూపాయలు విరాళం ఇచ్చేందుకు ముందుకొచ్చారు. అలాగే మిగిలిన వారందరూ తమ శక్తి మేరకు ఆర్థికసాయం అందిస్తున్నారు. అందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ప్రతీ ఒక్కరూ వెయ్యి రూపాయలు చెల్లించి కమిటీలో సభ్యులుగా చేరుతున్నారు. పాఠశాల అభివృద్ధితో పాటు, అవసరమైన మౌలిక వసతులు, కల్పిస్తున్నారు. ఫర్నిచర్‌తో పాటు, కంప్యూటర్లను అందుబాటులోకి తెస్తున్నారు. కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించుకున్నారు. అలాగే 50 ఏళ్లు పూర్తి చేసుకున్న జూనియర్ కళాశాల అభివృద్ధికి, అవసరమైన వసతులు కల్పించేందుకు వెనుకాడబోమని వారు చెప్తున్నారు. ఉన్నత స్థాయికి ఎదిగేందుకు తాము చదువులో తొలి అడుగులు వేసిన విద్యాసంస్థలను అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటామని అంటున్నారు.

ఇక్కడ చదువుకొని... ఉన్నత స్థాయికి ఎదిగి...

ఆర్‌ఐడీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న వారు ప్రస్తుతం జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రముఖులుగా ఉన్నారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ పాఠశాలలోనే చదువుకున్నారు.

అలాగే రియల్ ఎస్టేట్ రంగంలో ప్రముఖుడైన మై హోమ్ అదినేత జూపల్లి రామేశ్వర్‌రావు, ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు, రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ జనరల్ సెక్రటరీ మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే దివంగత కటికనేని మధుసూదన్‌రావు కూడా ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. వారితో పాటు మరెందరో విద్యార్థులు ఉన్నత స్థాయి ఉద్యోగులుగా, విద్యావేత్తలుగా, క్రీడాకారులు, కవులు, కళాకారులుగా సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నారు. పాఠశాల, కళాశాలల అభివృద్ధికి వారందరూ ముందుకొచ్చారు.

ఆత్మీయ సమ్మేళనానికి భారీ ఏర్పాట్లు

రాణి ఇందిరాదేవి ఉన్నత పాఠశాలను స్థాపించి 94 సంవత్సరాలైంది. ఆర్‌ఐడీ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి 50 ఏళ్లు దాటింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నవంబరు 26, 27, 28వ తేదీల్లో మూడు రోజుల పాటు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఏర్పాట్లకు సిద్ధం అవుతున్నారు.



కొల్లాపూర్‌లో కొనసాగుతున్న ఆర్‌ఐడీ పాఠశాల భవన నిర్మాణ పనులు


పాఠశాలలో భవనం లోపల మరమ్మతులు

మట్టి దందా..

● ఏపీ టు తెలంగాణ

- » తెలంగాణ మైనింగ్‌కు భారీ నష్టం
- » మూడు నెలల్లో వేలాది టిప్పర్ల మట్టి రవాణా
- » చోద్యం చూస్తున్న స్థానిక అధికారులు
- » వెంచర్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న ఏపీ మట్టి మాఫియా


అలంపూర్ చౌరస్తా సమీపంలో అక్రమంగా మట్టి తీసుకెళ్తున్న వాహనాలు

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇసుక మాఫియా మొన్నటి దాక తుంగభద్ర నదిలో మన బార్డర్‌లోకి వచ్చి మరీ ఇసుక దోచుకెళ్లారు. ఇప్పుడేమో ఏపీ మట్టి మాఫియా ఎల్లలు దాటి తెలంగాణలోకి చొరబడి రవాణ చేస్తున్నారు. దీని వల్ల తెలంగాణ ప్రభుత్వం ఆదాయం కోల్పోతుంది. గత మూడు నెలల్లో సుమారు భారీ ఎత్తున తెలంగాణలోకి మట్టి తరలించి సొమ్ము చేసుకున్నారు. తాజాగా ఏపీకి చెందిన ఓ మట్టిమాఫియా లీడర్ తెలంగాణ బార్డర్‌లో అధికారులతో ములాఖత్ జరిపి గత వారంరోజులుగా అలంపూర్ చౌరస్తాలోని ఓ వెంచర్‌లోకి తరలిస్తున్నాడు. రోజు రాత్రి సమయాల్లో పదుల సంఖ్యలో టిప్పర్ల సాయంతో అక్రమంగా ఏపీలోని ఉలిందకొండ సమీప ప్రాంతాల నుంచి మట్టిని తీసుకొస్తున్నారు. ఇదంతా తెలిసిన స్థానిక అధికారులు పట్టించుకోకపోవడం వెనక పలు అనుమానాలకు తావిస్తున్నది.

ఏపీ మట్టి మాఫియాకు స్థానిక అధికారులు కొంతమంది సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలంపూర్ సమీపం నుంచి మట్టి తరలించాలంటే తెలంగాణ మైనింగ్ శాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. ఇందుకు చలానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తుందని కొందరు రియల్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండా దొంగచాటున రాత్రి సమయాల్లో ఏపీ నుంచి ఎర్రమట్టి దిగుమతి చేసుకుంటున్నారు. వాస్తవానికి ఏపీకి చెందిన కమర్షియల్ వాహనాలు తెలంగాణలో తిరగాలంటే ఆర్టీఏ శాఖ నుంచి రోడ్డు అనుమతులు పొందాలి కానీ అవేవి లేకుండానే వందలాది టిప్పర్లు వచ్చి వెళ్తున్న స్థానిక ఆర్‌టీఏ శాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. పరోక్షంగా తెలంగాణ రాష్ట్ర ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ విషయంపై ఉండవల్లి ఎస్సై మహేష్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. నాలుగు రోజుల క్రితం రాత్రి సమయాల్లో ఏపీ నుంచి మన ప్రాంతంలోకి ఎర్రమట్టి రవాణ చేస్తున్నారన్న సమాచారం రావాడంతో సదరు వ్యాపారులకు గట్టిగా హెచ్చరించాం. ఒకవేళ మళ్లీ రవాణ జరుగుతుంటే మాత్రం చర్యలు తీసుకుంటాం.


ఉమ్మడి జిల్లా టోర్నీకి ఎంపికైన క్రీడాకారులు

నేటి నుంచి ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీ

- » తలబడనున్న ఆరు జట్లు
- » ప్రతిభ కనబరిస్తే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక
- » టోర్నీని ప్రారంభించనున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి

టోర్నీలో ప్రతిభ చాటాలి

ఉమ్మడి జిల్లా అండర్-23 టోర్నీని ఎండీసీఏ మైదానంలో సోమవారం నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నాం. 50 ఓవర్ల మ్యాచ్‌లు ఉంటాయి. మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తాం. క్రీడాకారులు టోర్నీలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి టోర్నీకి ఎంపికైనందుకు అవకాశం ఉంది.

- ఎ.రాజశేఖర్,


జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి 27వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీ నేటి నుంచి బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో నిర్వహించనున్నారు. ఇటీవలే జరిగిన ఉమ్మడి జిల్లా ఎంపికల్లో 70 మంది క్రీడాకారులు ఎంపిక చేసి ఆరు జట్లుగా విభజించారు. పూల్-ఏలో మహబూబ్‌నగర్, నారాయణపేట, కొడంగల్, పూల్-బీలో నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జట్లు ఉన్నాయి. పూల్-ఏ మ్యాచ్‌లు 21న మహబూబ్‌నగర్-నారాయణపేట, 22న నారాయణపేట-కొడంగల్, 23న కొడంగల్-మహబూబ్‌నగర్ జట్ల మధ్య పోటీలు ఉంటాయి. పూల్-బీ మ్యాచ్‌లు 24న నాగర్‌రకర్నూల్-గద్వాల, 25న వనపర్తి-నాగర్‌కర్నూల్, 26న గద్వాల-వనపర్తి జట్ల మధ్య పోటీలు ఉంటాయి. 27న పూల్-ఏ, పూల్-బి విజేతల మధ్య మ్యాచ్ ఉంటుంది. టోర్నీ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో తుది జట్టును ఎంపిక చేస్తారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నవంబర్‌లో 2 నుంచి వరంగల్, సంగారెడ్డి పట్టణాల్లో నిర్వహించే అండర్-23 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో పాల్గొంటుంది.

ఉదయం 11 గంటలకు టోర్నీని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నారు.

చెరకు రైతు సంఘం అధ్యక్షుడిగా కె.రాజన్న


అధ్యక్షుడు రాజన్న


ప్రధాన కార్యదర్శి రవి

అమరచింత, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కృష్ణవేణి చెరకు రైతు సంఘం అధ్యక్షుడిగా అమరచింతకు చెందిన రాజన్న మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కమిటీని ఆదివారం ఆ సంఘం ముఖ్య సలహాదారు సీహెచ్ రామచందర్ ప్రకటించారు. అమరచింతకు చెందిన రాజన్న ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నాలుగోసారి వరుసగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వాసారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రవి (మస్తీపూర్), సహాయ కార్యదర్శిగా శివుడు (పెబ్బేరు), నారాయణ (సింగంపేట), రాజశేఖర్ రెడ్డి (మూలమల్ల), కోశాధికారిగా చంద్రసేనారెడ్డి (మస్తీపూర్), ముఖ్య సలహాదారులుగా సీహెచ్ రామచందర్, ఆంజనేయులు, వెంకటేశ్వర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులుగా నాగేంద్రం (తిప్పడంపల్లి) శాలిమియా (శాసనూల్) రంగారెడ్డి (కడుమూర్) వీరన్న (శాసనూల్), రాజు (కృష్ణంపల్లి), వెంకటేశ్వర్లు గౌడ్ (ప్రాగటూర్), భగవంత్ రెడ్డి (మూలమల్ల), మహేంద్రచారి (ధర్మపురం), అరుణ్ కుమార్, తిరుపతయ్య (అమరచింత), రవీందర్ రెడ్డి (రాణిపేట), సుధాకర్ రెడ్డి, పి.రవి, జి.రవి (చంద్రఘడ్), ధనుంజయ(కొండదొడ్డి), రామకృష్టారెడ్డి(మునగాల), యుగంధర్ రెడ్డి(పిజెపల్లి), నంగి శ్రీకాంత్ (మస్తీపూర్), వెంకటేష్‌చారి (పెద్దకడుమూర్) తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

మినీ స్టేడియానికి స్థలం వితరణ

- » ఎకరంన్నరలో రూ. 2.97 కోట్ల వ్యయంతో క్రీడా ప్రాంగణం
- » సరళాదేవి, లక్ష్మారెడ్డి విగ్రహాలను ఆవిష్కరించిన దేశాయి ప్రకాష్ రెడ్డి


మాట్లాడుతున్న దేశాయి ప్రకాష్ రెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో సెంటు భూమికే కొట్లాడుకునే కాలంలో ఎకరంన్నర భూమిని గ్రామ క్రీడా ప్రాంగణానికి వితరణ చేసి మానవత్వం చాటుకున్నారు దేశాయి పద్మజ, వెంకటేశ్వర రెడ్డిలు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామానికి చెందిన దేశాయి సరళాదేవి, లక్ష్మారెడ్డిల స్మారకార్థమై గ్రామంలో ఆత్మకూరు మండలానికి సంబంధించిన క్రీడాకారులు పాల్గొనే విధంగా వితరణ చేశారు. స్టేడియంలో వారి విగ్రహాలను ఏర్పాటు చేసి ఆదివారం మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మజారెడ్డి మాట్లాడుతూ... తన తండ్రి లక్ష్మారెడ్డి గ్రామానికి పెద్ద దిక్కుగా ఉంటూ నిరుపేదల పిల్లలు చదువుకునేందుకు ప్రభుత్వ పాఠశాల, గ్రామ అభివృద్ధి కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భూమిని కేటాయించి గ్రామ అభివృద్ధిని కోరుకున్నారని తెలిపారు. గ్రామ ప్రజల సౌకర్యార్థమై హైదరాబాద్ నుంచి మూలమల్ల గ్రామం మీదుగా జూరాల ప్రాజెక్టు వరకు ఆర్టీసీ బస్సును వేయించి సౌకర్యాలు తీర్చారని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేను గ్రామ అభివృద్ధి కొరకు స్థలాన్ని కేటాయించామని తెలిపారు. ప్రస్తుతం స్టేడియంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, జిమ్ వంటి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసేందుకు 2 కోట్ల 97 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. త్వరలో ప్రాంగణాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. గ్రామంలో తమ తండ్రికి సహకరించిన ప్రతీ ఒక్కరిని సన్మానించారు.

ఇసుక ట్రాక్టర్‌పట్టివేత

కల్వకుర్తిటౌన్, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ఎల్లికల్ చౌరస్తాలో ఆ దివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుద్దకల్ గ్రామానికి చెందిన పుట్టా కృష్ణమూర్తి అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్ అని గుర్తించామని ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నాడు.

నిందితుడికి రిమాండ్

ఖిల్లాఘణపురం, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మానాజీపేట మాజీ సర్పంచ్ సతీష్‌పై భూ తగాదాలో భాగంగా దాడి చేసిన ఏ2 నిందితుడు రాజనాల ఆంజనేయులు ఆదివారం పోలీసుల అదుపులోకి తీసుకుని కోర్టు న్యాయాధికారి ఎదుట ప్రవేశ పెట్టగా.. రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సురేష్ గౌడ్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ... తప్పించుకుని తిరుగుతున్న ఏ1 నిందితుడు రాజనా ల బాలరాజు కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తు న్నట్లు తెలిపారు. భూ తగాదాల్లో దాడులకు పాల్పడితే చర్యలు తప్పవని తెలిపారు.

పొగాకు రైతుకు కలిసొచ్చేనా?

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి) : నడిగడ్డ రైతు నూతన పంటల వైపు మొగ్గుచూపుతు న్నారు. రెండేళ్ల క్రితం వరకు అత్యధికంగా పత్తి, కంది, మొక్కజొన్న, మిరప, వరి తదితర పంటలు సాగు చేసేవారు. మొన్నటిదాక ఉండవల్లి మండల కేంద్రంలో పేరుగాంచిన వీఎస్టీ కంపెనీయే పొగాకు కొనుగోలు చేసేది. రెండేళ్ల క్రితం ఐటీసీ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందు జీపీఐ, అలయన్స్, డెక్కన్, పీడీపీ అనే ప్రయివేటు టబాకో కంప నీలు జిల్లాలోకి ప్రవేశించాయి. గతంలో ఉన్న ధరకంటే సుమారు 50శాతం పెంచి రూ.16వేల దాక ఇస్తామని రైతుల్లో కొత్త ఆశను రేకెత్తించాయి. దీంతో పొగాకు ఒక్క అలంపూర్ క్లస్టర్ పరిధిలో సుమారు 17వేల ఎకరాలు సాగు చేశారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది మూడింతలు పెరిగిం ది. రబీ సీజన్‌లో మరో వెయ్యి ఎక రాలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచన వేస్తు న్నారు.

ప్రైవేట్ కంపెనీలకు నమ్ముకొని..

ప్రయివేటు కంపెనీలను నమ్ముకుని రైతులు పొగాకు సాగుకు పునుకున్నారు. గతేడాది కూడా ఇవే కంపనీలు ఒక అడుగు ముందుకేసి పల్లెల్లోకి వచ్చి నారు అందించి ప్రోత్సహించారు. ఈ ఏడాది సుమారు ఐదువేల ఎకరాలు సాగైంది. గతేడాది పంటదిగు బడి వచ్చాక నిబంధనల ప్రకారం పంటను విక్రయానికి తీసుకెళ్తే పలుకొర్రిలు పెట్టి ధర తగ్గించారని రైతులు మండిపడారు. ప్రముఖ ఐటీసీ కంపనీ బేయర్ హమాలీలు చేసే పనిని కూడా తమతో చేయించి హమాలీ రుసుం వసూలు చేశారని పలువురు రైతు లు అవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి పంటలైతే బాగు న్నాయి. గతేడాదిలాగే పంటలొచ్చాక లేనిపోని కొర్రిలు పెట్టి ధరలు తగ్గిస్తారేమోనని రైతులు చర్చించుకుంటున్నారు. పొగాకు పంట విరివిగాసాగు చేయడంతో కూలీల కొరత ఏర్పడే ఆవకాశం కూడా ఉంది. నాటువేయాడానికే రూ.700 దాకా చెల్లించారు. ఇక తోర ణాలు కట్టడానికి కూలీ రూ.1,000 అవుతుందని రైతులు అంచన వేస్తున్నారు.

ఆశాభావంతో పప్పుశనగ రైతు..

పదేళ్ల క్రితం వరకు నడిగడ్డలోని అలంపూర్ నియోజకవర్గం లోని అలంపూర్, మానవపాడు, ఉండవల్లి, ఇటిక్యాల, వడ్డేపల్లి మండలాల్లో పప్పుశనగ విరివిగా సాగయ్యేది.. కాలక్రమేణ కమర్షి యల్ పంటలవైపు రైతు మొగ్గుచూపడం, మొక్కజొన్న సాగు పెర గడం పప్పుశనగ ధరలు పడిపోయాయి. అయినా చాలామంది రైతు ఆనవాయితీలా సదరుపంటను సాగుచేస్తూనే ఉన్నారు. ఖర్చు, శ్రమ తక్కువ కావడం, పత్తిపంట దిగుబడులు తగ్గడంతో ఈ ఏడాది శనగపంట సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే సుమారు వెయ్యి ఎకరాల్లో సాగు అయినట్లు అంచనా. ఇంకా మరో మూడు వేల ఎకరాలు సాగు అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాదితో పోల్చితే రూ.500నుంచి రూ.1,000 వరకు పెరిగి క్వింటాలు ధర రూ.6,800దాక ఉందని, ది గుబడుల సమయానికి ధరల్లో తేడాలు రావొచ్చని అంటున్నారు.

పత్తిని కాదని పప్పుశనగ సాగు

గతేడాది పత్తిపంట సాగు చేశాం. పత్తిపై పెట్టుబడులు పెర గడం, దిగుబడులు తగ్గడం వల్ల పప్పుశనగ సాగుచేస్తున్నాం. ధర కూడా గతేడాది కంటే కాస్త పెరిగింది. దిగుబడుల సమయానికి ఈ ధరలు ఉంటాయన్న నమ్మకం లేదు. పంటకు ఖర్చు, శ్రమ తగ్గుతుందని సాగుకు సిద్ధమయ్యాం.

- ముల్కి సీతరామిరెడ్డి, రైతు చెన్నిపాడు

లాభాలు వస్తాయన్న ఆశతో..

గతేడాది తోటిరైతులు పొగాకు సాగుచేసి లాభాలు అర్జించారు. అదే ఆశతో ఈ ఏడాది పత్తిపంటను కాదని పొగాకు సాగు చేస్తు న్నాను. గతేడాది కొన్ని కంపనీలు లేనిపోని కొర్రిలు పెట్టి ధరలు తగ్గించడం, పంటను వెనక్కి పంపడం విన్నాం. కంపనీలు కొర్రీలు పెట్టకుండా పంటను కొనుగోలు చేస్తే రైతుకు బాగుంటుంది.

- బీ చంద్రుడు, శేర్‌పల్లి గ్రామం, ఉండవెల్లి

జింకల దండు దాడి

- నాశనమవుతున్న పచ్చని పంటలు

- మేత కోసం వనాన్ని వీడుతున్న వన్య ప్రాణులు
- మందలుగా పొలాల్లో గెంతులు.. పరుగులు
- ఆందోళనలో కృష్ణానది పరివాహక ప్రాంతాల రైతులు
- ప్రతిపాదనలకే పరిమితమైన జింకల పునరావాస కేంద్రం

గంతులు వేస్తూ, పరుగులు తీస్తున్న జింకల దండ్లు కనువిందు చేస్తాయి.. కానీ రైతులను మాత్రం ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఎందుకంటే అవి అడవిని వదిలి పొలాల్లోకి చేరుతున్నాయి. మొలకలను తింటూ, గంతులు వేస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో నారాయణపేట జిల్లాలోని కృష్ణానది తీర ప్రాంత గ్రామాలకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జింకల కోసం పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- నారాయణపేట(ఆంధ్రజ్యోతి)


ఊట్కూర్ శివారులోని పొలంలో జింకల దండు


మక్తల్‌లో చేపట్టిన రిలే దీక్షలో బీకేఎస్ నాయకులు (ఫైల్)

అడవులు పలుచబడటం, సరైన మేత లభించకపోవడంతో జింకలు పంట పొలాలపై దాడి చేస్తున్నాయి. మందలు మందలుగా పొలాల్లో గంతులు వేస్తూ, పరుగులు తీస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో నారాయణపేట జిల్లాలోని కృష్ణా పరివాహక ప్రాంతాల రైతులు ఆందోళన చెందుతున్నారు. నదీ పరివాహక ప్రాంతంలో అడవి పలుచబడటం, చెట్ల పొదలు లేకపోవడంతో అవి ఉండేందుకు అవాసాలు కరువవడం, సరైన మేత దొరకక పోవడంతో అవి జనావాసాల వైపు వస్తున్నాయి. మేత కోసం గుంపులుగా నదీ పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలపై పడుతున్నాయి.

తీవ్రమైన సమస్య

ప్రధానంగా జిల్లాలోని ముడుమాల్, మాగనూర్, కృష్ణా, రామసముద్రం, దండు, పస్పుల, రుద్రసముద్రం, చందాపూర్, కాచ్వార్, సాంపల్లి, మంథన్‌గోడ్, ఊట్కూర్, ఓబ్లాపూర్, పగిడిమర్రి తదితర గ్రామాల రైతులు జింకల దండుతో ఆందోళన చెందుతున్నారు. పత్తి, జొన్న, వేరుశనగ, కంది, ఆముదం, పొద్దు తిరుగుడు, కూరగాయల పంటలను తింటూ పాడు చేస్తున్నాయని రైతులు చెప్తున్నారు. మొక్క దశలోనే జింకల తినడం వల్ల పంటలకు నష్టం కలుగుతుందని అంటున్నారు. పొరుగునున్న కర్ణాటక రాష్ట్రంలో జింకల నియంత్రణకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటుండం వల్ల అక్కడి నుంచి మన రాష్ట్రానికి వస్తున్నాయని చెప్తున్నారు.

ఆందోళన బాట పట్టిన రైతులు

జింకల బెడద నుంచి పంటలను కాపాడాలని బీకేఎస్ ఆధ్వర్యంలో రైతులు ఆందోళన బాట పట్టారు. రెండేళ్ల క్రితం మక్తల్ తహసీల్దార్ కార్యాలయం ముందు ఐదు రోజుల పాటు రిలే దీక్షలు నిర్వహించారు. వారి ఆందోళనకు అఖిల పక్షం నాయకులు మద్దతు పలికారు. అలాగే అటవీశాఖ కార్యాలయం ముందు ధర్నాతో పాటు, వంటా వార్పు చేపట్టారు. మండల అధికారులతో పాటు, అప్పటి కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో జింకల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అప్పటి కలెక్టర్ హరిచందన అటవీశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో కృష్ణ మండలంలోని ముడుమాల్ సమీపంలో సర్వే నంబర్ 194లో 80 ఎకరాలు, 192లో 120 ఎకరాలు, మొత్తం 200 ఎకరాల ప్రభుత్వ భూమిలో జింకల పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందుకు రెండున్నర కోట్ల రూపాయలు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఆ మేరకు ప్రతిపాదనలను రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పించారు. ఆ తర్వాత కొయంబత్తూర్‌లోని సలీం అలీ కన్వర్షన్ సెంటర్ శాస్త్రవేత్తల బృందం పరిశోధనలు ప్రారంభిస్తారని, అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీ రక్షణ కమిటీ సమావేశంలో అధికారులు తెలిపారు. కానీ పునరావాస కేంద్రం ఏర్పాటు మాత్రం ప్రతిపాదనలకే పరిమితమయ్యింది.

పంటలను కాపాడాలి



జింకల బారి నుంచి పంటలను కాపాడి, రైతాంగాన్ని అదుకోవాలి. ప్రతీ సంవత్సరం జింకల వల్ల జరుగుతున్న పంట నష్టాన్ని అధికా రుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ముడు మాల్‌లో జింకల పునారావాస కేం ద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసు కోవాలి.

- వెంకటేశ్, బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు, మక్తల్

జింకలతో పంటలకు నష్టం



జింకల మందలు పొలాలపై దాడి చేసి, పంటలను నాశనం చేస్తున్నాయి. మొక్క దశలో అవి మొక్కలను తింటూ, తొక్కుడంతో తీవ్ర నష్టం కలుగుతోంది. ప్రభుత్వం స్పందించి జింకల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి.

- మైపాల్‌రెడ్డి, రైతు, ఓబ్లాపూర్


మాగనూర్ మండలంలోని పంట పొలాల్లో పరుగులు తీస్తున్న జింకలు


జింకల పునరావాస కేంద్రం ఏర్పాటు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో (ఫైల్)

ఇద్దరు కార్మికుల దుర్మరణం

- జనగామ జిల్లాలో బస్సు, ఆటోను ఢీకొన్న బైక్
- మృతుల్లో వనపర్తి యువకుడు

దేవరుప్పుల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలి కొంది. బతుకుదెరువు కోసం వచ్చిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం కలిచివేసింది. ఈ విషాదకర ఘటన జనగామ జిల్లా జనగామ-సూర్యా పేట రాష్ట్ర రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ కథనం ప్రకారం. కర్నూల్ జిల్లా మొగిలికి చెందిన బోయ నర్సింహా(20), వనపర్తి జిల్లా మాదాపురంనకు చెందిన చీరేలు భరత్(22) కలిసి కొడకండ్ల మండలం రామన్నగూడెంలో ప్లంబింగ్ పనికోసం వచ్చారు. పని మీద బైక్‌పై జనగామ-సూర్యాపేట రహదారిపై దేవరుప్పులకు బయలుదేరారు. గొల్లపల్లి బస్ స్టేజీ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు యత్నించారు. ఇదే సమయంలో ఎదురుగా వస్తున్న టాటా ఏస్ ట్రాలీ వాహనాన్ని ఢీకొట్టి, ఆర్టీసీ బస్సుకు తగిలారు. దాంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన నర్సింహా, భరత్ కిందపడి అక్క డికక్కడే మృత్యువాత పడ్డారు. కాగా, మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సింగరాజుపల్లికి గ్రామానికి చెందిన కొంగరి భాస్కర్(డ్రైవర్) టాటా ఏస్ వాహనంలో తలుపులు, కిటికీలు తీసుకురావటానికి మొండ్రాయి వెళ్తున్న రాపాక ఉప్పలయ్య, రేణుక ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతదేహాలను జన గామ మార్చురీకి తరలించి, వారి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారమిచ్చారు. మృతుల కుటుంబ సభ్యుల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పది మంది జీహెచ్‌ఎంల సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : స్పౌజ్ పాయింట్ల విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చిన పది మంది జీహెచ్‌ఎంలపై సస్పె న్షన్ వేటు వేస్తూ విద్యా శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2023 సెప్టెంబరులో జరిగిన ప్రధానోపాధ్యాయుల బదిలీల్లో పలువురు జీహెచ్‌ఎంలు తప్పుడు స్పౌజ్ ధ్రువపత్రాలు సమర్పించి, తాము కోరుకున్న స్థానం పొందారు. అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంపై విచారణ చేపట్టిన ఆర్జేడీ విజయలక్ష్మీ ఆ ఫైలును కమిషనరే ట్‌కు పంపారు. దీంతో విచారించిన అధికా రులు పది మంది జీహెచ్‌ఎంలపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై డీఈవో రవీందర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

క్రైం కార్నర్

బండరాయి బ్లాస్టింగ్‌తో బాలుడికి గాయాలు

వంగూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : బ్లాస్టింగ్ పేలుళ్లకు ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సర్వం పల్లి గ్రామ సమీపంలో డీఎల్‌ఐ కాల్వ పను లు జరుగుతున్నాయి. కాల్వ పనుల్లో భాగం గా బండరాళ్లను పగులగొట్టేందుకు బ్లాస్టింగ్ లు చేపడుతున్నారు. శనివారం సాయంత్రం బండ రాళ్లు బ్లాస్టింగ్ చేశారు. నాలుగు వందల మీటర్ల దూరంలో ఇంటి ముంగిట ఉన్న రిషితేజకు బండరాయి పెచ్చు వచ్చి బలంగా తగలడంతో కుడి చేయి విరిగింది. రక్తగాయాలతో విలవిల్లాడుతున్న బాలుడిని వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడు వెల్దండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

గద్వాల క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వా ల జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ చౌర స్తాలో ఆదివారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలో ఓ హోటల్‌లో పనిచేస్తున్న తాయప్ప(80) రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా ఓమ్ని వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలి పారు.

వ్యక్తిపై ముగ్గురి దాడి

జడ్చర్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న వ్యక్తిపై అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన జడ్చర్లలోని శ్రీనివాస కాలనీలో శనివారం అర్ధరాత్రి చోటుచేసు కుంది. జడ్చర్ల ఎస్సై శివానందం తెలిపిన వివరాల మేరకు.. పోలేపల్లి సెజ్‌లోని ఓ పరిశ్రమలో విధులు ముగించుకుని శ్రీని వాసకాలనీలోని ఇంటికి వెళ్తున్న రాగంసతీష్ అనే వ్యక్తిని నిఖిల్, ఖన్నా, నాని అడ్డగించి గొడవకు దిగి, దాడికి పాల్పడ్డారని బాధితు డు సతీష్ పిర్యాదు చేశాడని తెలిపారు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



విద్యా వ్యవస్థలో మార్పునకు కృషి

- కుటుంబ సభ్యుల సహకారం మరువలేను
- తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఉండ్యాల బాలకిష్టారెడ్డి

తాడూరు/బిజినేపల్లి,అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : చేస్తున్న పనిలో నిబద్ధత, కుటుంబ సభ్యుల సహ కారం ఉంటే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేసు కోవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఉండ్యాల బాలకిష్టారెడ్డి అన్నారు. తెలంగాణ విద్యా మండలి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యం లో తన స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూ రు మండలం పర్వతాయిపల్లికి ఆదివారం వచ్చారు. ఈ ఆనంద క్షణాలను మొదటగా కుటుంబ సభ్యుల సమక్షంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ కుటుంబ సభ్యుల సహాయ సహ కారాలతోనే ఇంతటి విజయం సాధ్యమైందని అన్నా రు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఉన్న విద్యా వ్యవస్థ లో సమూల మార్పులకు కృషి చేస్తానని అన్నారు. వ్యవస్థలో తీసుకొచ్చిన సమూల మార్పులను విద్యా రంగ వ్యవస్థలో సైతం తీసుకొచ్చి విద్యార్థుల భవి ష్యత్‌కు బంగారు బాటలు వేస్తామన్నారు. అనంత రం కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఆయన ను శాలువా, పుష్ప గుచ్ఛం అందించి అభినందిం చారు. పర్వతాయిపల్లి పాఠశాలకు చెందిన ఉపా ధ్యాయులు ప్రత్యేకంగా సన్మానించారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంత, పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బాలకృష్టారెడ్డి వట్టెం వెంకన్న స్వామి దేవస్థానానికి ఆదివారం రావడంతో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మా నించి మాట్లాడారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఉన్నారు.

అమరులకు సెల్యూట్

- 1990-2006 వరకు పోలీసులకు, మావోయిస్టులకు మధ్య భీకర పోరు
- శాంతిభద్రతలను కాపాడటంలో ప్రాణాలు ఫణంగా పెట్టిన పోలీసులు
- ఉమ్మడి జిల్లాలో 39 మంది మృతి
- సంచలనం రేకెత్తించిన సోమశిల ఘటన
- నేడు పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం

మహబూబ్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో దశాబ్దంన్నర కాలం పాటు మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన పోరాటంలో ఎందరో పోలీసులు అమరులయ్యారు. నక్సల్స్ చర్యతో అప్పటి జిల్లా ఎస్పీతోపాటు తొమ్మిది మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. 1993 నవం బరు 14న సోమశిల గుట్టల్లో జరిగిన ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలం రేకెత్తించింది. పోలీసులను, జిల్లా ప్రజలను తీవ్రంగా కలిచివేసింది. ఈ ఘటనకు ముందురోజు మావోయిస్టులు సోమశిలలోని అతిథి గృహాన్ని పేల్చివేశారు. 14న ఎస్పీ పరదేశీనాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎస్పీతో పాటు పోలీస్ అధికారులు ప్రైవేట్ బస్సులో తిరుగు ప్రయాణం అయ్యారు. సోమశిల శివారులో పోలీసులు ప్రయాణిస్తున్న బస్సును మందుపాతరతో పేల్చడంతో బస్సు 20 అడుగుల ఎత్తుకు ఎగిసిపడి, రెండు తునక లైంది. ఈ ప్రమాదంలో ఎస్పీ తన కాళ్ళు పోయినా నక్సల్‌కు ఎదురొడ్డిపోరాడి, ఆయుధాలను కాపాడుకోగ లిగారు. ఈ ఘటనలో ఎస్పీ తోపాటు అప్పటి కోడేర్, కొల్లాపూర్ ఎస్‌ఐలు శివకుమార్, శివప్రసాద్ సహా మరో ఆరుగురు కానిస్టేబుల్స్ మరణించారు. ఎస్పీ పర దేశీనాయుడు త్యాగానికి గుర్తుగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వన్‌టౌన్ చౌరస్తాకు పరదేశీ నాయుడు చౌక్‌గా నామక రణం చేశారు.


పాలమూరులో ఏర్పాటు చేసిన ఎస్పీ పరదేశీనాయుడు విగ్రహం

బీకే లక్ష్మాపూర్ ఘటనలో

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పరిధిలోని బీకే లక్ష్మాపూర్ శివారులో 17.05.1997న పోలీసులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. లక్ష్మాపూర్‌లో పోలీసు ఇన్ పార్మర్లు అన్న నెపంతో నక్సల్స్ కొంతమందిపై దాడి చేయడం చేశారు. విషయం తెలుసుకున్న అమ్రాబాద్ ఎస్‌ఐ మల్సూర్ మరో నలుగురు కానిస్టేబుల్స్‌తో లక్ష్మాపూర్ గ్రామాన్ని సంద ర్శించారు. బాధితులను పరామర్శించిన అనంతరం ట్రాక్టర్‌లో తిరుగు ప్రయాణం అయ్యారు. మావోయి స్టులు సరిగ్గా గ్రామ పొలిమెరలోనే మందుపాతర పెట్టి ట్రాక్టర్‌ను పేల్చేయడంతో ఎస్‌ఐ సహా నలుగురు కానిస్టేబుల్స్ మరణించారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరిగిన ఘటనల్లో పోలీసులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టారు. 2006లో జిల్లాలో చివరి ఘటన చోటుచేసుకుంది. అమరుల కుటుంబ సభ్యులకు అర్హతను బట్టి ఉద్యోగం, ఇంటి స్థలాలను కేటాయించారు. పోలీసు అమరులు నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 30 మంది ఉండగా, మహ బూబ్‌నగర్‌లో ఇద్దరు, వనపర్తిలో నలు గురు, నారాయణపేట జిల్లాలో ఒకరు, సైబరాబాద్ పరిధిలో జిల్లాకు చెందిన ఇద్దరు ఉన్నారు.

మహబూబ్‌నగర్‌లో నేటి కార్యక్రమాలు

- ఉదయం 7:25 గంటలకు పరేడ్ బలగాలు ఎస్పీకి గౌరవ వందనం సమర్పిస్తాయి.
- 7:30 గంటలకు జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్ వేదిక వద్దకు చేరుకుంటారు. ఎనిమిది గంటలకు అడిషనల్ ఎస్పీ 1.9.2023 నుంచి 31.08.2024 వరకు విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అధికారులు, సిబ్బంది పేర్లు చదు వుతారు.
- 8:20 గంటలకు అమరులకు సంతాపం తెలుపుతూ మౌనం పాటించనున్నారు.
- 8:30 గంటలకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తారు.
- 8:45 గంటలకు అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ అధికారులు, అమరుల కుటుంబ సభ్యులు నివాళులు అర్పిస్తారు.
- 9:15 గంటలకు పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి వన్‌టౌన్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, ఎస్పీ పరదేశినాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తారు.
- 10:30 గంటలకు పోలీసు అమరుల కుటుంబ సభ్యులతో అధికారులు సమావేశం అవుతారు.

ఉలిక్కిపడ్డ నారాయణపేట

- 2005 ఆగస్టు 15న మావోయిస్టుల మారణకాండ
- విధి నిర్వహణలో అసువులు బాసిన ఎమ్మెల్యే గన్‌మెన్ రాజారెడ్డి

నారాయణపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అభి వృద్ధి కార్యక్రమాల ప్రారంభించేందుకు 2005 ఆగస్టు 15న నారాయణపేటలో జరిగే కార్యక్రమంలో పాల్గొన్న అప్పటి ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి, ఆయన తనయుడు చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి, మరో తొమ్మిది(ఒకరు గన్‌మె న్) మావోయిస్టుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో నారాయణపేట ఉలిక్కిపడింది. విధి నిర్వహణలో అసువులు బాసిన చిత్తూరు జిల్లా తంబ ళ్లపల్లి గ్రామానికి చెందిన గన్‌మెన్ రాజారెడ్డితో పాటు దేశ వ్యాప్తంగా అసువులు బాసిన పోలీస్, ఆర్మీ అమర వీరులను స్మరించుకుంటూ సోమవారం నారాయణ పేట జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించనున్నారు.

పోలీస్ అమరుల వివరాలు

క్రసం	మరణించిన తేదీ	అధికారిపేరు	ఘటన జరిగిన ప్రాంతం
1	24.10.1990	ఖాజాపాష, పీసీ	తుర్కదిన్నె
2	01.04.1991	ప్రభాకర్, పీసీ	వంగూరు
3	14.12.1991	ప్రభాకర్, పీసీ	కొల్లాపూర్
4	14.11.1993	పరదేశినాయుడు, ఎస్పీ	సోమశిల
5		కిశోర్, ఎస్సై కోడేరు	సోమశిల
6		శివప్రసాద్ ఎస్సై కొల్లాపూర్	సోమశిల
7		వైవిఎస్ ప్రసాద్, పీసీ	సోమశిల
8		సుభాన్, పీసీ	సోమశిల
9		మహ్మద్‌జొహెబ్,ఏఆర్‌పీసీ	సోమశిల
10		జయరాములు, పీసీ	సోమశిల
11		రంగారెడ్డి, ఏఆర్‌హెచ్‌సీ	సోమశిల
12		షేక్‌హైదర్, ఏఆర్‌పీసీ	సోమశిల
13	08.05.1994	షేక్‌ఫహీముద్దీన్, పీసీ	తలకొండపల్లి
14	05.05.1996	మురళీధర్‌రెడ్డి, పీసీ	కుడికిళ్ళ
15	01.04.1997	చంద్రశేఖర్, పీసీ	కొండనాగుల
16	17.05.1997	మల్సూర్, ఎస్సై అమ్రాబాద్	లక్ష్మాపూర్
17		నాగేశ్వరుడు, పీసీ	లక్ష్మాపూర్
18		మారెప్ప, ఏఆర్‌పీసీ	లక్ష్మాపూర్
19		శంకరయ్య, ఏఆర్‌పీసీ	లక్ష్మాపూర్
20		జగదీశ్వర్‌రెడ్డి, పీసీ	లక్ష్మాపూర్
21	22.05.1997	మహబూబ్‌అలీఖాన్, పీసీ	చింతపెంట్ల
22	01.12.1999	భాస్కర్‌రెడ్డి, ఎస్సై	పెబ్బేరు తూముకుంట
23		ఆంజనేయులు, పీసీ	తూముకుంట
24		టీ గోపాల్, పీసీ	తూముకుంట
25	30.06.2000	కేతావత్ హన్మియానాయక్,పీసీ	ఇప్పలపల్లి
26	14.01.2001	డీ శ్రీనివాస్‌రావు, హోంగార్డు	పదర
27	25.02.2001	కే హన్మంత్‌రెడ్డి, ఎస్సై	ఆమన్‌గల్
28	06.08.2002	పండరి, పీసీ	మన్ననూర్
29	02.02.2004	నేనావత్ హమ్లానాయక్, ఏఆర్‌పీసీ	కొల్లాపూర్
30		ఎం వెంకటరెడ్డి, ఏఆర్‌పీసీ	కొల్లాపూర్
31	10.03.2004	సుగుణాకర్, ఏఆర్‌పీసీ	అడ్డాకుల
32	18.03.2005	కే ప్రకాశ్, పీసీ	బాలనగర్
33	31.03.2005	లక్ష్మయ్య, హెచ్‌సీ	అచ్చంపేట
34		శంకర్‌నాయక్, పీసీ	అచ్చంపేట
35	15.08.2005	రాజారెడ్డి, ఏఆర్‌పీసీ	నారాయణపేట
36	11.11.2005	మొహినుద్దీన్, ఎస్సై సీసీకుంట	ఆత్మకూర్
37	18.03.2006	ఎండీ జహంగీర్, హెచ్‌సి	కొండనాగుల
38	19.03.2006	ఎన్ జోసుబాబు, గ్రేహౌండ్స్	క్రిష్ణారివర్
39	12.06.2006	సీ రమేశ్, పీసీ	కొల్లాపూర్

న్యూస్ బాక్స్

చారకొండ వెంకటేష్ నియామకంపై హర్షం

చారకొండ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రానికి చెందిన ఉద్యమకారుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చారకొండ వెంకటేష్‌ను రాష్ట్ర ప్రభుత్వం విద్యాకమిషన్ సభ్యుడిగా నియమించడం హర్షణీయమని పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చారకొండ వెంకటేష్ ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంలో తెలంగాణ సాధనకు తన వంతుగా అనేక ఉద్యమాలు నిర్వహించారని, విద్యాకమిషన్‌లో సభ్యుడిగా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీటీ రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు వినతి

వెల్దండ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని భైరాపూర్ నుంచి కలకొండకు వెళ్లే రహదారిని బీటీ రోడ్డు చేయాలని ఆదివారం భైరాపూర్ గ్రామస్థులు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఈ రోడ్డుపై కంకర పరిచి వదిలివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. గ్రామం నుంచి హైదరాబాద్, ఆమనగల్లుకు వెళ్లేందుకు ఇబ్బందులు తొలగుతాయని తెలిపారు. బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో తలారి నర్సింహ, మెండె మల్లేష్, గొల్లం రాములమ్మ, జంగయ్య, సాయితిరుమల, చంద్రమ్మ, నర్సింహ, రవి, కోటయ్య, మహేష్, సత్యం, గిరిప్రసాద్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెన్నచెర్ల గ్రామానికి చెందిన వడ్డె సంపంగి హనుమంతు చిన్న కుమారుడు వడ్డె సంపంగి సైలేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పెద్దకొత్తపల్లి మండల వడ్డెర సంఘం సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.14500 ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కోరారు. వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు పసుల నరసింహ, తిమ్మాజి పేట మండల అధ్యక్షుడు బాలస్వామి, అచ్చంపేట మండల ఉపాధ్యక్షుడు పిట్ల నరేందర్, పెద్దకొత్తపల్లి మండల ఉపాధ్య క్షుడు ఇరిగదిండ్ల మల్లేష్, నాయకులు సంపంగి శేఖర్, ఓర్సు బంగారయ్య, లాలుస్వామి, ఓర్సు రమేష్, ఇరిగదిండ్ల నాగేశ్వర్, పస్పుల చెన్నయ్య పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నేడు రక్తదాన శిబిరం

అచ్చంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నేడు పోలీస్ శాఖ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామని సీఐ రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెగా రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని సహకరించాలన్నారు. రక్తదానం చేయడం వల్ల మనం మరొకరి ప్రాణదాతలమవుతామన్నారు.

శాంతి భద్రతలకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు



ఎస్ఐ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గిరిజనులు

బిజినేపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి, శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నూతన ఎస్ఐ కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బిజినేపల్లి ఎస్ఐగా ఆయన బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్న మధ్యవర్తులను ఆశ్రయిం చకుండా తనను నేరుగా కలవాలని సూచించారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా ఆయనను గిరిజన సంఘం మండల నాయకులు గోవిందు నాయక్, హూల్యానాయక్, చందులాల్, చంద్రునాయక్, గోపాల్ నాయక్, పాండు నాయక్‌లు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

మహబూబ్ సుభానీ దర్గాలో గ్యార్మీ వేడుకలు

ఊర్కొండ, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊర్కొండ పేట మహబూబ్ సుభాని దర్గా వద్ద ఆదివారం గ్యార్మీ పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం గ్రామ ముస్లిం యువకులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మజీద్ (ప్రార్థనా మందిరం) నుండి ముస్లిం యువకులు భారీ ర్యాలీతో మహబూబ్ సుభాని దర్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు జహంగీర్, చోటు, కైసర్, ఖదీర్, బారి, రియాజుద్దీన్, జహీర్ ఉన్నారు.

వెక్కిరిస్తున్న శిలాఫలకం

- భూమి పూజకే పరిమితం
- ఉల్పర విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం
- ఏడాదైనా ప్రారంభం కాని పనులు

వంగూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉల్పర 33/11 కె.వి. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభానికే పరిమితమయ్యాయి. ఉల్పరలోని ఓ రైతు భూమిని కేటాయించి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పూనుకున్నారు. 2023 సెప్టెంబరులో దీని నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు భూమి పూజ చేశారు. అభివృద్ధి నిధుల్లో భాగంగా రూ.2.74 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. పనులను ప్రారంభించి వదిలేశారు. దీంతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడు తున్నారు.

ఈ సబ్ స్టేషన్ పనులు పూర్తయితే...

ఈ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయి తే ఉల్పరతో పాటు మిట్టసదగోడు, కోనాపూర్, పోతారెడ్డిపల్లి, రంగాపూర్ గ్రామాల్లో విద్యుత్‌లో వోల్టేజీ సమస్య తీరుతుంది. ప్రస్తుతం సరఫరా అవుతున్న డిండిచింతపల్లి, జాజాల సబ్ స్టేషన్ల కు భారం తగ్గుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే నిర్మాణ పను లను వేగవంతం చేయించి, పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం గురించి ట్రాన్స్‌కో ఏఈ మేఘనాథ్‌ను వివరణ కోరగా సబ్ స్టేషన్‌కు కేటాయించిన స్థలం గ్రామపంచాయతీ పరిధిలోనిది. ఇప్పుడు ఆ భూమిని ప్లాట్లు చేయాలని డిమాండ్ రావడంతో సమస్య నెలకొంది. విషయాన్ని ఉన్నతాధికారులకు నివే దించాం. త్వరగా సమస్యను పరిష్కరించి, పనులు చేపట్టేలా చర్యలు తీసుకుం టాం.



సబ్‌స్టేషన్ నిర్మాణానికి వేసిన శిలాఫలకం

సబ్ స్టేషన్ పనులు ప్రారంభించాలి



మా గ్రామానికి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు కావడంతో ఇక విద్యుత్ ప రంగా మేలు జరుతుందని ఆశపడ్డాం. కానీ, ఏడాది దాటినా ఇప్పటి వరకూ సబ్ స్టేషన్ ప నులు ప్రారంభం కాలేదు. లో వోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. వెంటనే అధికారులు పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి.

- బంగారయ్య, రైతు, ఉల్పర

ఆరోపణలపై దృష్టి సారించాలి

- ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో డీఈవోకు వినతి



డీఈవో గోవిందరాజులుకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 20 : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందిపై వస్తున్న ఆరోపణలపై దృష్టి సారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ధర్మ టీచర్స్ యూనియన్, స్టేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా విద్యాధికారి గోవిందరాజులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న సిబ్బంది, డీఎస్సీ 2024 నియామకాలపై సోషల్ మీడియాలో తరచుగా ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. కొంత మంది విద్యాశాఖపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, దీనికి నివారించేందుకు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డీఈవోను కోరారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కోఆర్డినేటర్ వంకేశ్వరం నిరంజన్, ధర్మ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి నిరంజన్, ప్రధాన కార్యదర్శి కూరాకుల ఆంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి కొంగరి జానయ్య, కోశాధికారి నల్లవాల అర్జున్, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్, దళిత నాయకుడు వడ్డెమాన్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో శ్రీనివాస్



రాలేగావ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, శ్రీనివాస్

తిమ్మాజిపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాలేగాన్ అసెంబ్లీ నియోజకవర్గంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ బహదూర్ అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న గ్యారెంటీ పథకాలను ఆయన ప్రజలకు వివరిం చారు. అంతకు ముందు అసెంబ్లీ బూత్‌లెవల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట వరుణ్‌కుమార్, సెహ్వగ్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సిద్దు బహద్దూర్ ఉన్నారు.

'సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె కొనసాగిస్తాం'

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 20: మునిసిపల్ కార్మికుల సమస్యలను వచ్చే నెల 15 లోపు పరిష్క రించకపోతే సమ్మెను తిరిగి కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణంలో చేపట్టిన నిరవధిక సమ్మెను ఆదివారం విరమించి నిరసన వ్యక్తం చేశారు. మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కస్తామని కమిషనర్ రాతపూర్వకంగా హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.గీత, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శేఖర్, భీముడు, రమేష్, బాలరాజు, వెంకటయ్య, సత్యం, నరసింహ, మహేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నాయకుల పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ రాములు

కల్వకుర్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండూరు గ్రామానికి చెందిన ఊషన్న, అంతయ్యగౌడ్‌లు మృతి చెందారు. మృతుల కుటుంబాలను ఆదివారం మాజీ ఎంపీ రాములు పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

● చారకొండ : మండలంలోని గోకారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పంజుగులల క్ష్మమ్మ కుటుంబసభ్యులను ఆదివారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకుడు పగడాల ఆంజనేయులు పరామర్శించారు. ఇద్దరూ కలిసి బాధిత కుటుంబ సభ్యులకు రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు.గ్రామస్థులు పాల్గొన్నారు.

● చారకొండ : మండలంలోని గోకారంలో అనారోగ్యంతో మృతి చెందిన పెద్దమ్మ ఈ నెల 12 న మృతి చెందింది. ఆదివారం దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాయితి ఆశాదీప్‌రెడ్డి బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

పిచికారి పంపులు పంపిణీ

అచ్చంపేటటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని ఐనోల్, సింగారం గ్రామాలలో రైతులకు సోలార్ పిచికారి పంపులను పంపిణీ చేశారు. గ్రామాలలో పేద రైతులకు వ్యవసాయ పరికరాలు చార్జింగ్ స్ప్రే పంపులు, పంటలో పురుగుల, దోమల నివారణ సోలార్ ట్రిప్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డీవో లింగస్వామి యాదవ్ మాట్లాడుతూ మండలాన్ని తమ సంస్థ దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సీఎఫ్ చరణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న జడ్పీహెచ్ఎస్ 1995-1996 బ్యాచ్ విద్యార్థులు

కల్వకుర్తిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో ఎంబీఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జడ్పీహెచ్ఎస్ 1995-1996 సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థుల ఆత్మీయసమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఆరోజుల్లో విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను వేడుకకు ఆహ్వానించి వారుచెప్పిన మంచిమాటలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు ఆరోజుల్లో వారు చేసిన అల్లరి పనులను గుర్తుచేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువా, పూల మాలలతో సన్మానించారు. ఉపాధ్యాయులు ముత్యాల కృష్ణయ్య, అంజనేయులు, యాదయ్య గౌడు, విజయభాస్కర్, సుగుణమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..



జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పకడ్బందీ చర్యలు

- ఆంధ్రజ్యోతితో ట్రాఫిక్ ఎస్ఐ కల్యాణ్

నాగర్‌కర్నూల్, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ కల్యాణ్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత కొత్త కార్యాలయాలు, షోరూమ్‌లు, విద్యా సంస్థలు ప్రారంభమయ్యాయి. దీని కారణంగా రద్దీ ఏర్పడినట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేనప్పటికీ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రత్యేక చొరవ కారణంగా పది మంది సిబ్బందితో ట్రాఫిక్‌ను రెగ్యులేట్ చేస్తున్నామని స్పష్టం చేసిన ఎస్ఐ కల్యాణ్ మున్ముందు తీసుకుబోయే కార్యాచరణను వెల్లడించారు.

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ రద్దీ బాగా పెరిగింది. నియంత్రణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లా కేంద్రంలో వివిధ కారణాల దృష్ట్యా వాహనాల రద్దీ పెరిగిన మాట వాస్తవం. అందుకే ట్రాఫిక్‌కు ప్రత్యేక విభాగం లేనప్పటికీ ఎస్పీ చొరవతో ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తున్నాం.

ప్రత్యేకంగా రద్దీ ఉండే ప్రాంతాలను గుర్తించారా

జిల్లా కేంద్రంలో బస్టాండ్, శ్రీపురం, నాగనూల్ చౌరస్తాలను రద్దీ ప్రాంతంగా గుర్తించాం. ఇటీవల నల్లవెల్లి రోడ్డులో కూడా ట్రాఫిక్ స్తంభించిపోతున్న అంశాన్ని గుర్తించి రద్దీ పాయింట్‌లో పోలీస్ సిబ్బందిని నియమించాం.

స్కూల్ జోన్లలో మీరు తీసుకుంటున్న చర్యలేమిటి?

స్కూల్ బస్సులు వెళ్లి తిరిగొచ్చే క్రమంలో ఆ టైమింగ్స్‌ను బట్టి అక్కడ కూడా ట్రాఫిక్ ఇబ్బందిని నియమించాం. ప్రధానంగా పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న కూడలి వద్ద స్కూల్ పిల్లలు వచ్చి వెళ్లే సమయంలో ప్రత్యేకంగా రోడ్డును దాటించే విధంగా ట్రాఫిక్ సిబ్బందిని నియమించాం.

రద్దీ త్రీవంగా ఉండే నల్లవెల్లి రోడ్డు, పాత కలెక్టరేట్ నివాస గృహం వద్ద ఏం చర్యలు తీసుకుంటున్నారు

ఈ రెండు మార్గాలలో దుకాణాల ముందు అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీన్ని నియంత్రించేందుకు పూర్తి స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నాం. నల్లవెల్లి రోడ్డులోని ఎస్‌బీఐ బ్రాంచ్ ఎదుట మునిసిపల్ స్థలం ఉంది. అక్కడ వాహనాలను పార్కింగ్ చేసే విధంగా మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్నాం. అక్కడ ఆ ప్రయత్నం కొలిక్కి వస్తే నల్లవెల్లి రోడ్డులో ప్రధానంగా సమస్య తీరుతుంది.

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రతీ పాయింట్‌లోను తమ సిబ్బంది ద్వారా కఠినమైన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా కేంద్రంలో ఇప్పటి వరకు ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 5వేల చలాన్లు రాశాం. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అంశం పోలీసుల వల్లనే సాధ్యం కాదు. ప్రజలు ఇందుకు సహకరించాలి. ప్రతీ ఒక్కరిని సురక్షితంగా ఇంటికి పంపించే ప్రక్రియలో భాగస్వాములు కావాలి.

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లతో విద్యా విప్లవానికి నాంది

- ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిల వెల్లడి
- తూడుకుర్తిలో రెసిడెన్షియల్ పాఠశాల పనుల పరిశీలన



తూడుకుర్తిలో పాఠశాల భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కలెక్టర్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : యంగ్ రెసిడెన్షియల్ స్కూళ్లతో తెలంగాణలో విద్యావిప్లవం రానున్నదని పార్లమెంట్ సభ్యుడు మల్లురవి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని తూడుకుర్తి గ్రామంలో నిర్మించనున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్‌లతో కలిసి వారు ఆదివారం పరిశీలించారు. తూడుకుర్తి గ్రామ శివారులోని సర్వే నెంబరు 816లో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జాతీయ సమైక్యతను పెంపొందించేలా అన్ని కులాల విద్యార్థులు ఒకే దగ్గర చదువుకోవడానికి ఈ స్కూళ్లు ఎంతో దోహదపడుతాయన్నారు.ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ దాదాపు 4వేల మంది విద్యార్థులు చదువుకునేలా వసతిగృహంతో పాటు పాఠశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన వారిలో డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కూచకుళ్ల నరసింహారెడ్డి, కోటయ్య యాదవ్ ఉన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

- మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చెవ్వ మాధవులు



తిమ్మాజిపేటలో మాలల ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాల మహానాడు సంఘం నాయకులు

తిమ్మాజిపేట/ అమ్రాబాద్/ మన్ననూర్/ కోడేరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలుర ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఈ నెల 27న నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని పలువురు మాల మహానాడు సంఘం నాయకులు అన్నారు. ఆత్మ గౌరవ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ● తిమ్మాజిపేటలో అంబేడ్కర్ విగ్రహం దగ్గర మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చెవ్వ మాదవులు ఆధ్వర్యంలో ఆదివా రం మాలల ఆత్మగౌరవ సభ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధ మని అన్నారు. మాలల హక్కుల సాధన కోసం ప్రతీ ఒక్కరు సైనికుడిలా పని చేయాలన్నారు. గ్రామాల వారీగా మాలలు ఆత్మగౌరవ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సత్తి, మాజీ ఎంపీపీ ప్రవీణ్ కుమార్, నాయకులు చెన్నయ్య, బంగా రయ్య, మహేష్, ప్రకాశ్, శివ, భాస్కర్, రామ కృష్ణ లింగం, చందు, యాదగిరి, సురేష్ పాల్గొన్నారు.

● అమ్రాబాద్‌లో మాల మహానాడు రాష్ట్ర నాయకుడు కుందా మల్లికార్జున్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాయకులు దివాకర్, నాసరయ్య, వెంకటేశ్వర్లు, యశ్వంత్ పాల్గొన్నారు.

● మన్ననూర్‌లో మాల మహానాడు రాష్ట్ర నాయకులు కుంద మల్లికార్జున్, మద్దెల దివాకర్, నాసరయ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. మాలలంతా సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పెర్కుల వెంకటేశ్వర్లు, యశ్వంత్, బాబు, అరుణ్, రంజిత్, గోవర్ధన్, అంజి, కృష్ణ నారాయణ పాల్గొన్నారు.

● కోడేరు ఊరగుట్ట చెన్నకేశవ ఆలయ ఆవరణలో మాల మహానాడు కొల్లాపూర్ నియోజకవర్గ నాయకుడు బండి శ్రీను ఆధ్వర్యంలో మాలల ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల నాయకులు మధు, రాము, రంగదాస్, ఈ.సుధాకర్, బాలయ్య, వెంకటేష్, మహేందర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే విమర్శలు సరికాదు

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్‌కుమార్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని కల్వకుర్తి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బృంగి ఆనంద్‌కుమార్ అన్నారు. నీతి నిజాయి తీతో ఉండి పని చేస్తున్న ఎమ్మెల్యేపై చేసిన విమర్శలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలో బీఎస్ఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లతో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే కళాశాలలో బోగస్ సర్టిఫికెట్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే విమర్శించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వెల్దండ మండలంలోని చెరుకూరు వద్ద కేఎల్ఐ డీ-82 కాల్వ ఎవరీ కోసం ఆగిందని విమర్శించారు. కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో కల్వకుర్తి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి 204 కోట్లతో పాటు డబుల్ బెడ్రూం ఇళ్లలో మిగిలిన పనులను పూర్తి చేయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విలేకర్ల సమావేశంలో కౌన్సిలర్లు లక్ష్మీ, శ్రీనివాసులు, ఎజాస్, బాలు, కాంగ్రెస్ మహిళా నాయకురాలు రేష్మా, కాంగ్రెస్ నాయకులు షానవాజ్‌ఖాన్, రమాకాంత్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి

కల్వకుర్తిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ మహమ్మారిపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని హెచ్ఐవీ ఎయిడ్స్ ప్రోగ్రాం ఐసీటీసీ కౌన్సిలర్ లింగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని పాలమూరు చౌరస్తా, బస్టాండు వద్ద, శివాజీచౌరస్తా వద్ద ఎల్ఈడీ స్క్రీన్‌మొబైల్ వ్యాన్‌ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉంటూ తెలియనివారికి అర్థమయ్యేలా ప్రచారం చేయాలని కోరారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలోని ప్రయాణికులకు, పాదచారులకు కరపత్రాలు పంపిణీ చేసి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది శ్రీనివాస్, వాణి, విజయలక్ష్మి, చెన్నమ్మ పాల్గొన్నారు.

నల్లమలలో భారీ వర్షం

మన్ననూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ప్రాంతంలోని మన్ననూరు, వటవర్లపల్లి, పర్హాబాద్, గుండం పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా తరుచూ వర్షాలు కురుస్తుండడంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి వర్షపు నీటితో నానడంతో పత్తికి ధర రావడం లేదని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కురుస్తున్న వానలకు చేతికొచ్చే పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్

- ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు



కొల్లాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొల్లాపూర్/ కల్వకుర్తి/ తిమ్మాజిపేట/ తెలకపల్లి/ ఊర్కొండ/ ఊర్కొండ/ పెంట్లవెల్లి/ ఉప్పునుంతల/వెల్దండ/ పదరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : గడిచిన అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్ర రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు పర్చకుండా రైతులను మోసం చేసిందని పేర్కొంటూ బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేర కు జిల్లాలో ధర్నా చేశారు. కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ముందు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముచ్చర్ల రాంచందర్‌యాదవ్, కట్టా శ్రీనివాసులు, మాచి నేనిపల్లి సింగిల్ విండో చైర్మన్ చింతకుంట శ్రీనివాసులు, కొల్లాపూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ హుజూర్ శ్రీను ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఎకరాకు రూ.5వేల రైతుబంధు ఇవ్వక పోగా రూ.7500ల రైతు బంధు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ విస్మరించిందని వారు ధ్వజమెత్తారు. పోలీసుల జోక్యంతో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన విరమించారు. ● కల్వకు ర్తిలో మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆధ్వర్యంలో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ● తిమ్మాజిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ● తెలకపల్లిలోని నెహ్రూ చౌరస్తాలో జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ మాధవరం హనుమంతురావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కోట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ● ఊర్కొండలోని కల్వ కుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు గిరి నాయక్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం సీఎం ముఖ్య మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ● పెంట్లవెల్లిలో మాజీ సర్పంచు రాజేష్ ఆధ్వర్యంలో రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ● ఉప్పునుంతల మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామంలో రైతు వేదిక భవనం వద్ద రైతు నిరసన దీక్షా కార్యక్రమం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీంద్రారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ● వెల్దండలోని హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై చల్ల మధుసూదన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.